క్లుప్తంగా

డిజిటల్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



వేల్పూర్: మంత్రి ప్రశాంత్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా బాల్కొండ నియోజకవర్గంలోని 2000 మంది ఎస్సెస్సీ విద్యార్థుల కోసం మంగళవారం హైదరాబాద్‌లో సొంత ఖర్చులతో డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన బార్‌కోడ్‌ను త్వరలో విద్యార్థులకు అందజేస్తామని, స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో విజయం సాధించాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శికి వేధింపులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన గురిజాల రాంరెడ్డి, గురిజల మధుసూదన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తనను బెదిరింపులకు పాల్పడుతున్నారని, విధులకు ఆటంకం కలిగిస్తున్నారని గ్రామ కార్యదర్శి చంద్రకళ ఎడపల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో గోపాలకృష్ణ, మండలంలోని పలు గ్రామ కార్యదర్శులతో కలిసి ఆమె ఎస్సై పాండేరావుకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతోపాటు గ్రామ పంచాయతీ పాలకవర్గం వీరిపై చర్యలు తీసుకోవాలని తీర్మానిస్తు చేసిన తీర్మానం కాపీని కూడా ఆమె పోలీసులకు అందజేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో ఓ బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం సర్పంచ్ శంకర్‌గౌడ్, ఉపసర్పంచ్ రాస మహేష్ అందజేశారు. కారోబార్ సుధాకర్, సాయినాథ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో సీసీ రోడ్డు పనులను మంగళవారం సర్పంచ్ వెల్మల సునిత ప్రారంభించారు. ఎంపీటీసీ లక్ష్మీ, నాయకులు మౌలానా, నర్సయ్య, లింగారెడ్డి, లింగాల అబ్బన్న, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ద్యాగ సరిన్ ప్రారంభించారు. ఉప సర్పంచ్ బాగాజీ లక్ష్మన్, ఎంపీటీసీ శ్యామల ఉన్నారు.

లైఫ్ స్కిల్స్ పెంచుకోవాలి



బోధన్: విద్యార్థులు ఏ రంగంలోనైన రాణించాలంటే కమ్యూనికేషన్, లైఫ్ స్కిల్స్ పెంచుకోవడం ఎంతో అవసరమని పలువురు వక్తలు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సాయి ఆదర్శ యువతి మండలి, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల లైబ్రేరియన్ వీరప్రసాద్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఆవశ్యకతపై, సీనియర్ న్యాయవాది మధుసింగ్ మహిళల హక్కులు, సమస్యలు, రక్షణచట్టాలపై, వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్ వినయ్ కుమార్ జీవిత నైపుణ్యాలు, వాటి ప్రయోజనాలు, ప్రాధాన్యతపై వివరించారు. ప్రిన్సిపల్ రంగారత్నం, వైస్ ప్రిన్సిపల్ నాహీదా, యువతి మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

డిచ్‌పల్లి: మండలంలోని దూస్‌గాం గ్రామంలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడినట్లు డిచ్‌పల్లి ఎస్సై గణేష్ తెలిపారు. వివరాలు ఇలా.. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన భిక్షపతి (35), కంజర్ గ్రామానికి చెందిన గంగాప్రసాద్ బైక్‌పై దూస్‌గాం గ్రామానికి వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో మూలమలుపులో ట్రాక్టర్ ట్రాలీ, బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో భిక్షపతి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందగా, గంగాప్రసాద్ గాయపడ్డారు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్కొండ ఆస్పత్రిలో ప్రసవ వేదన

- మత్తు వైద్యుడు లేక కాన్పులకు ఇబ్బందులు
- పిల్లల వైద్యుడి పోస్టు సైతం ఖాళీ
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు



బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి (క్లస్టర్ ఆస్పత్రి)లో మత్తు వైద్యుడు(అనస్థీషియ) లేకపోవడంతో ప్రసవాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత రెండేళ్లుగా ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు చేపడుతున్నారు. ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలని ప్రభుత్వ పెద్దలు ప్రచారం చేస్తున్నారు. కానీ ఆయా ఆస్పత్రుల్లో వైద్యుల కొరతను తీర్చడం లేదు.

ప్రయివేటు వైద్యులు వస్తేనే..

బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో మత్తు వైద్యుడు లేకపోవడంతో అద్దె డాక్టర్‌లు ఇచ్చిన సమయం ప్రకారం కేవలం వారంలో రెండు రోజులు మాత్రమే ఆపరేషన్లు చేస్తున్నారు. సాధారణ కాన్పులు కాని వారికి ఆపరేషన్ల ద్వారా ప్రసవాలు చేపడతారు. దీంతో ఆపరేషన్ చేయాలంటే మత్తు డాక్టర్ తప్పనిసరి. కానీ ప్రభుత్వాస్పత్రిలో మత్తు వైద్యుడు పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రయివేటు వైద్యులను అద్దెకు తీసుకువచ్చి ఆపరేషన్లు చేపడుతున్నారు. అత్యవసరమైతే ఇతర ఆస్పత్రులకు తరలిస్తున్నారు. మత్తు వైద్యుడు అందుబాటులో ఉంటే బాల్కొండ ఆస్పత్రిలోనే అత్యవసర వైద్య సేవలను కూడ అందించవచ్చని వైద్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ డివిజన్‌లో కేవలం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే మత్తు డాక్టర్లు (ఇద్దరు) ఉన్నారు. మిగతా అన్ని ఆస్పత్రుల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి.

పసిబిడ్డలను చూసేవారు కరువు..

ప్రస్తుతం ఆస్పత్రిలో అప్పుడప్పుడు ప్రసవాలు చేపడుతున్నారు. కానీ అప్పుడే పుట్టిన పసిపిల్లలను పరీక్షించడానికి పిల్లల వైద్యుడు అందుబాటులో లేడు. దీంతో పసికందులను పట్టుకుని వెంటనే ఆర్మూర్‌లో ప్రయివేటు ఆస్పత్రులకు పరుగెత్తాల్సి వస్తుంది. ఆపరేషన్‌ల ద్వారా ప్రసవాలు చేపట్టడానికి కావాల్సిన ముఖ్య వైద్యులు అందుబాటులో లేక మండలంలోని చాలామంది ప్రయివేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి ఆస్పత్రిలో అవసరమైన వైద్య సిబ్బందిని వెంటనే నియామించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం..

బాల్కొండ ఆస్పత్రిలో మత్తు వైద్యుడు, పిల్లల వైద్యుడు కొరత గురించి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పూర్తిస్థాయి వైద్యులు అందుబాటులో ఉంటే ఆపరేషన్లు ఎప్పుడైన చేయవచ్చు. అత్యవసర సేవలను కూడ కొనసాగించవచ్చు. –డాక్టర్ రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో ఆంధ్రయ్య

కమ్మర్‌పల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకోవాలని ఎంఈవో ఆంధ్రయ్య అన్నారు. కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడారు. పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రుల కలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. హెచ్ఎం రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

మాక్లూర్ మండలంలో..

మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ మండల నాయకుడు గంగోళ్ల ప్రళయ్ తేజ్ హాజరై, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి: మండలంలోని అమీర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 8వ తరగతి విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఉత్తమ బోధకులకు ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగామారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎం లక్ష్మీనారయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.



అమీర్‌నగర్‌లో..

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



పచ్చలనడ్కుడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో మంగళవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు క్షయవ్యాధి నిర్మూలనకు సామాజిక చైతన్య ర్యాలీ నిర్వహించారు. క్షయవ్యాధికి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపే నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. హెచ్ఎం సురేష్, హెచ్ఏఎఫ్ శోభ, ఆరోగ్యకార్యకర్తలు సబిత, కవిత, కల్పన పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. బోధన్ డివిజన్‌లో మొత్తం 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బోధన్ పట్టణంలో 9, కోటగిరి-1, వర్ని-2 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సుమారు 8,409 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9గంటలకే పరీక్ష ప్రారంభం అవుతుంది. ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇవ్వబోమని అధికారులు విద్యార్థులకు సూచిస్తున్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ఆరోగ్య ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో మ్యాన్‌కైండ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బాలింతలు, గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్లను డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అంజనా, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లావణ్య పంపిణీ చేశారు. జిల్లా టీబీ, హెచ్ఐవీ కో-ఆర్డినేటర్ రవిగౌడ్, సాతి ప్రోగ్రాం ఆఫీసర్ రవికుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



సమావేశంలో పాల్గొన్న పేద ప్రజలు

ఎడపల్లి(బోధన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేకుంటే ఆక్రమించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్ పేర్కొన్నారు. మండలంలోని నెహ్రూనగర్‌లో మంగళవారం పేదలు వేసుకున్న గుడిసెలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు పేదలపై కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారుల వైపు వెళ్లి కబ్జాలపై తేల్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు 125 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, పేదలు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



వేల్పూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



బాల్కొండలో పూజలు నిర్వహిస్తున్న నేతలు

పెర్కిట్(ఆర్మూర్)/బాల్కొండ/కమ్మర్‌పల్లి/వేల్పూర్: ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బడుల్లో విద్యార్థులకు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే పలు గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు.



పెర్కిట్‌లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మంత్రి ప్రశాంత్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని వేల్పూర్‌కు చెందిన గుగ్గిలం అశోక్ 57 కిలోమీటర్ల మారథాన్ పరుగు పూర్తి చేశారు. దీంతో అతడిని బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు.



చౌట్‌పల్లిలో కేక్ తినిపించుకుంటున్న నాయకులు



మెండోరాలో

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు



బహుమతులు ప్రదానం చేస్తున్న పండిత్ వినీత

ఆర్మూర్‌టౌన్: మహిళలు ప్రతి రంగంలో రాణిస్తూ, తమ సత్తా చాటుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాల్లో భాగంగా మహిళా సిబ్బందికి క్రీడాపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి రంగంలో మహిళలు అభివృద్ధి సాధిస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కౌన్సిలర్లు సుజాతరమేష్, మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, మహిళ సంఘాల సభ్యులు, ఆర్పీలు పాల్గొన్నారు.

మంత్రిని విమర్శించే అర్హత లేదు



బాల్కొండలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు..



భీమ్‌గల్‌లో..

బాల్కొండ: రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డిని విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, శేఖర్‌రెడ్డిలు అన్నారు. ఆయా మండలాల్లో మంగళవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు కనిపించకపోవడం బాధకరమన్నారు. మంత్రిపై అనుచిత వ్యాఖ్యాలు చేస్తు విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

భీమ్‌గల్: మండలకేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు మంత్రి ప్రశాంత్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని అన్నారు. మంత్రిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నాల బాల భగత్, పర్స నవీన్, శర్మ నాయక్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే బోధన్ అభివృద్ధి సాధ్యం



బోధన్: ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే బోధన్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని న్యాయవాదులు అన్నారు. బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 86వ రోజు కొనసాగాయి. దీక్షలో అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాది పాల్దే శంకర్ కూర్చున్నారు. విద్యార్థి సంఘాల జేఏసీ ప్రతినిధి శివకుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధితురాలికి అండగా ఉంటాం



రుద్రూర్: ప్రేమికుడి మోసానికి గురైన గంగోత్రికి న్యాయం జరిగే వరకూ పోరాడుదామని, ఆమెకు అండగా ఉంటామని ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, సబ్బని లత తెలిపారు. మోస్రా మండలం గోవూర్ గ్రామంలో మంగళవారం వారు గంగోత్రిని కలిసి మద్దతు ప్రకటించారు. కులం పేరుతో పెళ్లిని నిరాకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, గంగోత్రిని ప్రేమించిన నరేష్ వివాహం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నరేష్‌తో పాటు అతనికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గోదావరి ఒడ్డున గల సీతారాం త్యాగి మహారాజ్ ఆశ్రమంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యజ్ఞ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీతారాం త్యాగి మహారాజ్, భక్తులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నిజామాబాద్ అర్బన్: టీఎస్పీఎస్సీ నిర్లక్ష్యంతోనే ప్రశ్నాపత్రాలు లీకు అయ్యాయని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్ సింగ్ ఒక ప్రకటన డిమాండ్ చేశారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ)పేపర్ లీక్ ఘటన వెనుక టీఎస్పీఎస్సీ సభ్యులపై విచారణ జరిపించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సమాచారం..

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో బుధవారం మిషన్ భగీరథ తాగునీరు సరఫరాలో అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ ఒక ప్రకటనలో తెలిపారు. బాల్కొండ వద్ద గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను శుభ్రం చేస్తున్నందున ఒక రోజు నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి యథావిధిగా తాగునీరు సరఫరా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం శ్రీనునాయక్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. ఉప సర్పంచ్ సొడ మదువర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్యాడ్ల పంపిణీ..

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు మంగళవారం సర్పంచ్ దేవయ్య పరీక్ష అట్టలను వితరణ చేశారు. ఎంపీటీసీ గంగాధర్, ఉప సర్పంచ్ జలంధర్, హెచ్ఎం, రాజేందర్, విజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మించనున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి అంగరి దినేష్, శ్రావణి దంపతులు రూ.50వేలు విరాళంగా అందజేశారు. అనంతరం దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. సభ్యులు బద్రి, సుభాష్‌గౌడ్, చింత గణేష్, డిష్ నరేందర్ ఉన్నారు.

గన్‌పూర్ విష్ణుమూర్తి ఆలయానికి..

చందూర్: మండలంలోని గన్‌పూర్ విష్ణుమూర్తి స్వామి ఆలయానికి జెడ్పీటీసీ అంబర్ సింగ్ రూ.10వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు గోపీచంద్, కృష్ణ, మేకల శ్యామ్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పనుల పరిశీలన

రుద్రూర్: చందూరు మండల శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువపై నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను మంగళవారం చందూర్ సర్పంచ్ కర్లం సాయిరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఏఈ జీవన్, చందూరు సహకార సంఘం అధ్యక్షుడు అశోక్, వెంకటరెడ్డి, హైమద్ ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం..



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామంలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ఎఖార్‌పాష ప్రారంభించారు. ఎంపీటీసీ హైమద్, డాక్టర్ వినయ్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు కరిపె రవీందర్, శ్రావణ్‌కుమార్‌తో పాటు వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.